# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-07-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్ వికసిత భారత్ లక్ష్యానికి అనుగుణంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.**

**2.** **ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసేలా కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులను కేటాయించారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

**3.** **ఆబ్కారీ శాఖపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు శాసనసభలో శ్వేతపత్రాన్ని విడుదల చేస్తారు.**

**4.** **కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తగిన విధంగా నిధుల కేటాయింపులు జరగలేదని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు.**

**5.** **నీట్ యూజీ 2024 పరీక్షను మరోసారి నిర్వహించాల్సిన అవసరం లేదని భారత అత్యున్నత న్యాయ స్థానం తీర్పు వెలువరించింది.**

**6.** **"గ్రంథాలయ పితామహులు"గా పేరుగాంచిన అయ్యంకి వెంకటరమణయ్య జయంతి ఈరోజు.**

==========================

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్ వికసిత భారత్ లక్ష్యానికి అనుగుణంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. బడ్జెట్ పై ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం వేదికగా స్పందిస్తూ, సమాజంలోని ప్రతి వర్గానికి సాధికారతను, కల్పించి భారత్ అభివృద్ధికి దార్శనికంగా ఉందన్నారు. కేంద్రం ఉద్యోగ అనుసంధాన ప్రోత్సాహక పథకాలను ప్రకటించడం ద్వారా కొన్ని కోట్ల ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. ఈ బడ్జెట్ ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రధానమంత్రి తెలిపారు. ఈ బడ్జెట్ దేశ అభివృద్ధికి, ఉన్నత భవిష్యత్తుకి సహాయపడుతుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు, సహకార బృందానికి ప్రధానమంత్రి అభినందనలు తెలియజేశారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసేలా కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి నిధులను కేటాయించారని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనసభలో జరిగిన చర్చకు ముఖ్యమంత్రి నిన్న సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం తగిన

గుర్తింపు ఇచ్చిందని, ఇకపైనా ఇలాగే నిధుల కేటాయింపులు జరగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర వనరులు, సమస్యలు, అభివృద్ధి ప్రణాళికలు, సూపర్ సిక్స్ పథకాల అమలు తదితర అంశాలన్నింటిపైనా బడ్జెట్‌లో వివరిస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం అందించే సహకారం రాష్ట్ర పునర్నిర్మాణానికి చాలా ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల్లో భాగంగా గత ప్రభుత్వంలో 2019–24 మధ్య ఆబ్కారీ శాఖ స్థితిగతులపై ఈ రోజు శాసనసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్వేతప త్రాన్ని ప్రకటిస్తారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రేపు శాసన సభలో ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడుతుంది. అదే రోజు మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. బడ్జెట్ నేపథ్యంలో తమ ప్రతిపాదనలు ఈరోజు సాయంత్రంలోగా పంపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అన్నిశాఖల కార్యదర్శులను ఆదేశించారు.

-----------------------------

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణను నిర్లక్ష్యం చేశారని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు నిధులు ఇవ్వాల్సిన బాధ్యతను కేంద్రం విస్మరించిందని అన్నారు. నిధుల కేటాయింపు కోసం తాను 3 సార్లు ప్రధానమంత్రిని కలిశానని, రాష్ట్ర మంత్రులు కూడా పలు సార్లు కేంద్రమంత్రులను కలిశారని అయినా బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు జరగలేదని ఆరోపించారు. ప్రాంతీయ బాహ్య వలయ రహదారి నిర్మాణానికి ఆర్.ఆర్.ఆర్.కు కేంద్రం నిధులు విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. తెలంగాణ పట్ల కేంద్ర వైఖరిని నిరిసిస్తూ శాసనసభలో తీర్మానం చేస్తామని పార్లమెంట్‌లో కూడా కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యులు కేంద్రంపై నిధుల కోసం ఒత్తిడి తెస్తారని ముఖ్యమంత్రి తెలిపారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పేర్కొన్నారు. నిన్న ఢిల్లీలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన జిల్లాలకు కేంద్ర సాయం అందిస్తోందన్నారు రాయలసీమలోని నాలుగు, ఉత్తరాంధ్రలోని 3 జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాలుగా గుర్తించి మొత్తం రాష్ట్రంలోని 8 జిల్లాలకు సహకారం అందిస్తున్నారని తెలుపుతూ...

..వాయిస్.. 30 సెకన్లు

-----------------------------

నీట్ యూజీ 2024 పరీక్షను మరోసారి నిర్వహించాల్సిన అవసరం లేదని భారత అత్యున్నత న్యాయ స్థానం స్పష్టం చేసింది. నీట్ పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్న పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జేబీ పర్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం నిన్న తీర్పును వెలువరించింది. నీట్ పేపర్ లీకేజీ వాస్తవమేనని అయితే పరీక్ష విశ్వాసనీయత దెబ్బ తీసే విధంగా వ్యవస్థాపరంగా తప్పులు జరిగాయని చెప్పలేమని అన్నారు. నీట్ పరీక్షను మళ్ళీ నిర్వహిస్తే 23 లక్షల మంది విద్యార్థులు నష్ట పోతారని వారి

భవిష్యత్తుపై ప్రభావం ఉంటుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

మరోవైపు. నీట్ పరీక్షపై సుప్రీంకోర్టు తీర్పును కేంద్ర విద్యాశాఖ మంత్రి ధరేంద్ర ప్రధాన్ స్వాగతించారు. పారదర్శకమైన పరీక్షా విధానానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నీట్ పరీక్షలో అవకతవకలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు.

----------------------------

ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాదులోని శాసనసభ ఆవరణలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈనెల 31లోగా శాసనసభలో ద్రవ్య వినిమయ బిల్లును ప్రవేశ పెట్టాలని, లేని పక్షంలో జీతాలు కూడా ఇవ్వ లేని పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. తెలంగాణ అవసరాల దృష్ట్యా ఎక్కువ నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరతామని చెప్పారు. ప్రతిపక్షాలు ఇచ్చిన ప్రతి అంశంపై, ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి పేర్కొన్నారు.

----------------------------

“గ్రంథాలయ పితామహులు”గా పేరుగాంచిన అయ్యంకి వెంకటరమణయ్య జయంతి ఈ రోజు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం తాలూకా కొంకుదురు గ్రామంలో 1890 జూలై 24వ తేదీన ఆయన జన్మించారు. 1934-48 సంవత్సరాల మధ్య కోస్తాంధ్ర ప్రాంతంలో అనేక గ్రంథాలయాలు నెలకొల్పిన ఆయన విజయవాడలోని రామమోహన్ పుస్తక భాండాగారానికి కార్యదర్శిగా వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్‌లో గ్రంథాలయోద్యమానికి వెంకటరమణయ్య చేసిన కృషికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. దేశంలో పూర్తి స్థాయిలో గ్రంథాలయాలను నెలకొల్పిన వ్యక్తిగా పేరు పొంది… “ప్రజా గ్రంథాలయమే- ప్రజల విశ్వవిద్యాలయం” అని చాటి చెప్పిన అయ్యంకి వెంకటరమణయ్య 1979 మార్చి 7వ తేదీన తుది శ్వాస విడిచారు.

----------------------------

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని హామీలను నెరవేరుస్తామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. నిన్న హైదరాబాద్‌లో మంత్రి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు రావడాన్ని స్వాగతించారు. తెలంగాణలోని పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై కూడా కేంద్ర ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయకపోవడంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. విభజన చట్టంలోని హామీలను కేంద్రం తప్పనిసరిగా అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. కాజీపేట రైల్వే కోచ్ కర్మాగారం, బయ్యారం ఉక్కు కర్మాగారం, గిరిజన విశ్వవిద్యాలయానికి బడ్జెట్‌లో ఎలాంటి ప్రాధాన్యం దక్కలేదని విమర్శించారు.

----------------------------

ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేలా శాసనసభాపతిని ఆదేశించాలని కోరుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ప్రతిపక్ష నేత హోదా కోసం లేఖ రాసినా రాష్ట్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తెలపలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు.

======================